నక్షత్రమాల.

దువ్వూరి రామిరెడ్డిగారిచే రచియింపఁబడి

ప్రకటింపఁబడినది.

చెన్నపురి;

వావిళ్ల ప్రెస్సున

ముద్రితము.

1921.

 [వెల [illegible]

"Poetry has been to me its own exceeding great reward. It has soothed my offlictions; it has multiplied and refined my enjoyments; it has endeared solitude; and it has given me the habit of wishing to discover the good and beautiful in all that meets and surrounds me."

COLERIDGE.

విషయసూచిక.

శుద్ధపత్రము.

పుట.	పద్యము.	పాదము.	తప్పు.	ఒప్పు.
9	2	1	చరితారహస్యంబు	చరితరహస్యంబు
32	2	4	భిక్షుంబువెటి	భిక్షుంబువెట్టి
38	4	2	మబవనిపై	మబ్జవనిపై
41	2	3	క్షత్రియునకు	క్షత్రియుఁడు
47	4	3	కొఁబూలమాల	క్రొంబూలమాల
48	2	2	యింద్రధనన్సు	యింద్రధనుస్సు
49	1	2	ఁగుందు	నేడ్పు

ఈక్రిందిగీతమును 34-వ పుటయందు మూఁడవపద్యముగఁ బఠియింపవలయును.

సందెమబ్బుల చిఱువేరు చాయతీసి
పండువెన్నెల పసరునఁ బదనుచేసి
తరుణి, నీపట్టు ముసుఁగు నద్దకమువైవ
విఫల యత్నంబులం జల్పి వెఱ్ఱినైతి.

ఉపోద్ఘాతము.

మానవహృదయమును దైనిక కలకలమునుండి తొలగించి విషయభార విముక్తముచేసి, ప్రాపంచిక సీమాంతముల కవ్వల భావసృష్టికల్పితమైన నక్షత్రమండలమున సంచరింపఁజేయుటకు శిల్పము సహాయకారి. శిల్పములలోఁ బ్రతిక్షణ భావనవ్యతకు నాలవాలమైనది కావ్యశిల్పము. ఇతర శిల్పములకును గావ్యశిల్పమునకును జాలవ్యత్యాసముగలదు. ఒక చిత్రపటమును దర్శింత మనుకొనుఁడు. ఆ పటమునందు ఒక్కభావము, ఒక్కస్థితి, యొక్కవిధమైన రసానుభూతి యలవడును. కాని, కావ్యశిల్పమునం దిట్టినిశ్చలత యుండదు. అనుక్షణము భావములు పరిసరదృశ్యములు అనుభూతియు మెఱుగుతీఁగవలె మాఱుచుండును. కావ్యమును ఇప్పటి "సినమెటోగ్రాఫు" నకుఁ బోల్పవచ్చును.

కవులు సృష్టికర్తలు. వీరి ప్రధానకార్యము సృష్టి. ఇట్టి సృష్టివలనఁ బ్రయోజన మేమియని కొందరుముగ్ధహృదయులు, కొందరు శుష్కరసహృదయులు ప్రశ్నింపవచ్చును. కావ్యసృష్టివలన నమూల్యమైన ప్రయోజనముగలదు. రా

మణీయకము పరిపూర్ణముగ వికసింపని యీ ప్రపంచము నుండి, సర్వముతో సుఖ రమణీయమైన కల్పనా ప్రపంచమున, గంగాతరంగ శీతలవాఃకణ పూరితమును, నందనవన సద్యోవికసిత కుసుమ సౌరభ్య పులకితమునగు మందమారుత స్వాప్నికడోలికల రసార్ద్రమైన మానవహృదయమును గావ్యము ఉయ్యేలలూపుచుండును.

శంపాలతాంగిని అమృతాంశుముఖిని ప్రకృతి ఇంతవఱకు సృజింపలేదు. కాని శిల్పియుఁ గవియు సృజించిరి. ప్రకృతిలోపమును బూరించుటయే కళయొక్క ముఖ్య ప్రయోజనము. వివిధవస్తు సంయోగమునందు బ్రకృతికన్నను గవులు ముందంజ వేసియున్నారు. "చలువగల వెన్నెలల చెలువునకు సౌరభముగలిగినటు""Melody of flowers" మున్నగుకల్పనలిందునకుఁ దార్కాణములు. కావ్యము ఆనందమయము. కావుననే యానంద దాయకము. కావ్య ప్రయోజనములలో "సద్యః పరనిర్వృతయే" అనులాాక్షణిక నిర్వచనము ప్రధానమైనది.

నిజమైన కవిత్వము ఆకృతిబద్ధముగాదు. ఏయాకృతియుఁ గవితారసప్రవాహమును బట్టియుంచలేదు. మూర్తీభావింపని కవిత్వమే అప్పటమైనకవిత్వము. ఈ కవిత్వము ఏకాంతమునందు రసార్ద్రమైన మానవహృదయముచే నను

భవింపఁ బడుచున్నది. ప్రశాంతమను అక్షరములతో వ్రాయఁబడిన యీ కవిత్వమందుఁ జెవికి వినబడని గాన మున్నది. ఈ గానమనోహరత్వమును మార్దవమును గర్ణేంద్రియ సహాయములేక హృదయమే స్వయముగ ననుభవించుచున్నది. కావుననె "నొ గూచి" యను జపాను దేశపుఁ బ్రఖ్యాతకవి "వ్రాయబడిన కవిత్వమున కన్నను వ్రాయఁబడని కవిత్వమే మధురమైన" దని నుడివియున్నాఁడు. "కీట్సు" అను నాంగ్లేయ కవియు, "Heard meIodies are sweet, but those unheard are sweeter.—అని వ్రాసియున్నాఁడు. కవి యనుభవించు ఆనందము ఆతని భావవీథినిఁ బొడకట్టుదృశ్యము, స్థూలమైన భాషయందు గర్భీకరింపఁబడినపుడు ఆత్మసౌందర్యమును సగము కోలుపోవును. ఎందువలన ననగా భావములు సున్నితములైనవి. భాషస్థూలమైనది. కావునఁ గవిత్వమునందు అంతర్వ్యాప్తమైన భావకొంతయు బహిర్వ్యాప్తమైన భాష కొంతయు సమ్మిళితమై యుండును. కవిత్వమును నిఘంటు మూలమునఁ దెలిసికొనఁ గోరు నతఁడు రసవిహీనమైన శల్యపంజరమును మాత్రము చూడగల్గును. కాని యందలి యానందమును సౌందర్యమును ననుభవింపలేడు. కవిత్వమందలి ప్రతి పదముచుట్టును నిఘంటువు నిర్ణయమున కతీతమైన భావరోచి యావరించియుండును.

పద్యములు భావప్రేరకములు. భావములు ప్రతిబింబించుటయు, విరివియగుటయుఁ, బాఠకుని హృదయసంస్కారము ననుసరించి పరిపరి విధములుగ నుండును. కావుననే పాఠకులుకూడ కవులవలెనే రసార్ద్ర హృదయులుగా నుండవలయుననుట. తామరపాకుపైఁ జెరలాడు మంచు బొట్టు ప్రొద్దుపొడుపు మొదలు ప్రొద్దెక్కుకొలఁది కిరణవర్ణ భేదముల ననుసరించి బహువర్ణములు దాల్చునట్లు పాఠకుల సంస్కారభేదముల ననుసరించి కవితయు వివిధాకృతులతోఁ బొడకట్టు చుండును, ఇందుకీక్రింది దృష్టాంతము గనుఁడు: సూర్యుడ స్తమించెను. సంజ కెంజాయలు జలదశకలములపై నలమికొని పశ్చిమదిశను నొక చిత్రప్రదర్శన శాలగ మార్చి వైచెను. వరిచేలు పండి యొరగి చల్లగాలికి సముద్రతరంగములవలె నల్లనల్లన నాడుచుండెను. ఇట్టి దృశ్యమును నొక చిత్రకారుఁడును మఱియొక పల్లెటూరి కాఁపును సందర్శించుచుండిరను కొందము. చిత్రకారుని చిత్తము ఊహాతీతమైన యావర్ణసమ్మేళనముయొక్క సౌందర్యమున నిమగ్నమయి పోయియుండును. కాఁపువాని హృదయము బంగారు టెనుక వలె పండి యొరగియున్న వరిచేనుగాంచినంత ఉవ్విళ్లూరుచుండును. ఆతని మనము నాకర్షించుటకుఁ బడమటిదెసయందేమియును వింత తోఁపలేదు. దృశ్య మొక్కటియే యైనను, వారిహృదయఫలకములందు భిన్నముగఁ బ్రతిఫలించెను.

పూర్వులలోఁ గొందరు కవిత్వమును శాస్త్రముగఁ బరిగణించిరి. ఇదిచాల గొప్ప పొరపాటు. శాస్త్రమున నానందము లేదు. నగ్న సత్యము కలదు. శాస్త్రకారునికిని శిల్పికిని జాల వ్యత్యాసము గలదు. వారి మార్గములు ధ్రువములవలెఁ బరస్పర భిన్నములననిన సత్యబాహ్యముగాదు. కవియును శాస్త్ర కారుఁడును ఒక హృదయమును బరీక్షింపవలసిన యెడల కవి రసము, అనుభూతి, భావము మున్నగు వానికై వెదకుచుండును. శాస్త్రకారుఁడా హృదయమునుగోసి అందెన్ని క్రోవు లున్నవి, ఎన్ని యరలున్నవి, నెత్తురేమార్గమున సంచరించునను విషయములను బరీక్షించుచుండును.

తెలుగు కవులలోఁ, గవిత్వము శిల్పమని ప్రథమమునఁ గనిపెట్టిన తత్వవేది మహాకవి తిక్కన. కావుననే యాకవి బ్రహ్మ "కవిత్వ శిల్పమునం బారగుఁడఁ" అని చెప్పుకొని యున్నాఁడు.

స్వాతంత్ర్యమునఁ గొంత సాహసముగలదు. సాహసమనునది మానవప్రకృతిని నవీనమార్గావలంబనమునకుఁబురికొల్పును. మానవ సంఘము రాజకీయ సాంఘిక మత నైతిక దాస్యమునంబడి యాచారశృంఖలల మూలమున యంత్రచలితమగు నొక ప్రతిభాశూన్య విగ్రహమువలె నున్నపుడు అట్టి సంఘముయొక్క మనము నవీనకల్పనలకుఁ జోటీఁ

బాఱదు. ఆ స్థితినిఁ గల్లోలించి భావదాస్య భారమున మ్రగ్గు చున్న హృదయమునకు విశాల ప్రపంచ దృశ్యము కనఁ బడునట్లు విప్లవము జరుగనిదే మానవప్రకృతి నిర్నిద్రము గాదు. కృష్ణదేవరాయల కాలమునందు నూత్న కావ్య సృష్టికింగూడ నీలాటి విప్లవమే కారణము.

ప్రపంచ చరిత్రమును బరిశోధించి చూచినయెడల, పూర్వులకు భవిష్యత్సంతతివారినిఁదమతమ అభిప్రాయా చార మూలమున బంధించు చాపల్యము అమితముగనుండి నట్లు దోఁచుచున్నది. ఇట్టి యధికార చాపల్యము అన్ని మానవజాతులలోనునున్నది. ఇది యసంగతమేగాక హాస్యాస్పదమును. ఇట్టి యారోపితాధికారము మత సాంఘిక రాజకీయ విషయములందేగాక కవిత్వమునం గూడ నాటుకొనియుండినది. కావ్యలక్షణము ప్రథమ మునఁ గవుల రచనలనుండియే యుద్భవించిన దయ్యుఁ బ్రత్యేక లాక్షణికుల యధికారముద్రవలన ఆలక్షణమేకవు లను నిగళబద్ధులను గావించినది.

కావ్యములలో నేయేవర్ణనము లుండవలసినదియు నెట్టినా యికా నాయకులుండవలసినదియు లాక్షణికులే తీర్మానించి రి. కాన కవిసృష్టికిఁ గొన్నిహద్దు లేర్పడినవి. పూర్వకవుల కు రాజులే యాశ్రయులు. రాజులు పండితులను సులోచన

వుల మూలమునఁ గావ్యపరీక్ష గావించుచుండిరి. ఇఁకఁ బండితులు రసార్ద్రచిత్తముతోఁ గాక శుష్కమైనలాక్షణిక మానదండముతోఁ గావ్యశిల్పమును గొలతవేయుచుండిరి. లాక్షణిక ప్రమాణమునకు వెంట్రుకవాసంత తగ్గినను ఆ కావ్యము గ్రాహ్యముగాదు. కావుననే యాంధ్రప్రబంధము లన్నియు నొకే యచ్చున గ్రుద్దినట్లు లొకేతీరున నున్నవి. ఒక కావ్యమును సాంతముగఁ జదివిన మఱియొక కావ్యము ను జదువనవసరముండదు. అదే నాయిక; అదే నాయకుఁడు; అదే యుద్యానవనము; అదే సూహము; అదే విరహము; అదే శీతలోపచారము; అదే చెలికత్తె; అదే సూర్యోదయ ము అస్తమయము!

కాని యిప్పటి కాలస్వభావము, పరస్థితులు మాఱినవి. ముద్రణయంత్రములు కాగితములు ప్రబలినవి. కావున గ్రంథములు సర్వజనసామాన్యమునకు సులభ్యములగుచున్నవి. ఇప్పుడు కవులను బోషించు వారు ప్రజలు. ప్రజల యభిరుచియుఁ గవుల యభిరుచియు మాఱినది. ఇందుకుఁ జాల చారిత్రక కారణములుగలవు. పాశ్చాత్య సారస్వత సంబంధమువలనను, తన్నాగరకతా సంపర్కమువలనను ప్రజల భావములు ఆదర్శములు మాఱఁజొచ్చినవి. సంఘమునందుఁ గొంత జీవచలనము ప్రారంభమయినది. ఈనవీనపరిణామము

కవుల హృదయములఁ బ్రతి ఫలించి ఆంధ్రసారస్వతము నఁ జొచ్చినది. కావుననే నేఁడు హృదయమోహనమైన అధునాతన సారస్వతము తటితీపు తెలుగునందు బయలు దేఱినది.

ఈ గ్రంథమున సమకూర్పఁబడిన ఖండకావ్యములలోఁ జాలవఱకుఁ గృష్ణాపత్రిక, ఆంధ్రపత్రికా సంవత్సరాది సంచి కలు, న్యాయదీపిక మున్నగువార్తా పత్రికలలో నిదివఱకుఁ బ్రకటింపఁబడినవి. నేను పద్యములు పంపినవెంటనే నన్నుఁ బ్రోత్సహించుటకుఁ గాను అప్పుడప్పుడే తమపత్రికలలోఁ బ్రకటించుచుండిన యాయాపత్రికాసంపాదకులకు నేనెంత యుఁ గృతజ్ఞుఁడను.

ఈకావ్యములను నేనువిమర్శింపఁబూనుకొనలేదు.కవియే తాను రచియించినకావ్యములను, విమర్శకుఁడుగ నవతార మెత్తి పరిశీలించుట యసంభవము. స్వాభిమానము వలన ననవసరప్రశంస గావించుకొనుటయో లేక వినయము వలన ఉచిత ప్రశంస చేయకుండుటయో సహజముగఁ దటస్థిం చును. కావున నీకావ్యములయొక్క గుణాగుణవిమర్శనము రసైక పక్షపాతులైన సహృదయులకు వదలుచున్నాను.

కవులయెడ సమకాలికులకు నిరాదరణము అన్నిదేశము లందును అన్నికాలములందును ఉండినట్లు తోఁచుచున్నది.

ఈర్ష్యయుఁ "దనపెరటిచెట్టు మందుగాద"నెడు సామాన్య జనులమన స్తత్వమును, బరిచయమువలనఁ గలుగు నౌదాసీన్యమును ఇందుకుఁ గారణములుగ నుండవచ్చును. "సమకాలికు లెన్నడు మెచ్చరేగదా" యని చేమకూరు వెంకన్న వ్రాసిన యీ చిన్ని వాక్యమునందు ఆతని హృదయ వేదన యంతయు నిమిడి యున్నది. సమకాలికులచే నిరాదరింపఁబడిన మహాకవి భవభూతియొక్క వేడినిట్టూర్పులు

యే నామ కేచిదిహ నః ప్రథయం త్యవజ్ఞాం
జానంతి తే కిమపి, తాన్ప్రతినైష యత్నః
ఉత్పత్స్యతేఽస్తి మమకోఽపి సమానధర్మా
కాలోహ్యయం నిరవధి, ర్విపులాచపృథ్వీ.

అనునీశ్లోకమునందు నేఁటికిని ఆవిర్లువాఱుచున్నవి. తానురచియించిన "ఇన బెల్లా" యనుకావ్యముపై దాడి వెడలిన యీర్ష్యాపూరిత విమర్శనము వలన భగ్నచిత్తుఁడై "కీట్సు" అను నాంగ్లేయకవి స్నేహితుఁడైన షెల్లీకి "నేనుమరణించిన యనంతరము గొప్పకవినయ్యెదనుకొంటాను" అని వ్రాసినలేఖను జదివిన కిరాతుని హృదయమునందైన గరుణ మొలుకును. ఇట్టినిరుత్సాహకరసందర్భములందు " O! I sing for the mere joy of singing" అనుఉద్దేశమే కవిని ఆనందకవచునిగ నొనరించుచున్నది.

"ఓరి బాలక నీమురళీ రవంబు
వ్యర్థమౌనని చిత్తతాపంబువలదు.
రాగపరిచితుఁడెవ్వఁడో రమ్యగీతి
వినియెయుండు నానందంబు వెల్లివిరియ."

ఇట్లు.
దువ్వూరి రామిరెడ్డి.

నక్షత్రమాల.

కవిమనోరథము.

సాంధ్యకిమ్మీరవర్ణవస్త్రములు దాల్చి
గిరితటవిహారశృంగారకేళి సొలసి
రమణఁ జరియించుజలధరార్భకుని గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు!

ప్రత్యూషాశ్లేషమున విచ్చు ప్రసవమందుఁ
దరుణసూర్యాంశుమాలికాతరళకాంతి
మిళితమై రాలు తుహినాంబుకలిక గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు!

శిలలఁ బ్రవహించి, శీకరంబులను జల్లి
ప్రకృతిహృద్గతభావంబు బయలుపఱచు
గానముం జేయు మలయూఁటకాల్వ గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు!

శారదేందుమయూఖసంస్పర్శనముల
దైనికస్వప్నమాంద్యమ్ముఁ దలఁగఁ ద్రోసి
మొలకనవ్వులవేల్కను కలువ గాఁగ
నేల సృజియింవఁడో నన్ను నీశ్వరుండు!

యామినీవ్యోమమండలప్రాంగణమునఁ
గవిమనోనందరాజ్యంబుఁ గాంచువేళఁ
గాంతి వెదచల్లు నక్షత్రకంబు గాఁగ
నేల సృజియింపఁడో నన్ను నీశ్వరుండు!

ప్రణయాంజలి.

ఎవ్వతెయందు నామది లయించి తదన్యము చింత సేయదో
యెవ్వతె ప్రేమభావమును సహింపఁగరాని వియోగగంధముల్
నివ్వటిలంగఁ జేసెడినొ, నిద్దురలందు సులభ్య యైన యా
జవ్వని మన్మనఃప్రణయసాక్షిగ మంగళ మొందుగావుతన్.

అల్లియుఁబూలు పూవని లతావళులట్టుల నాదుకోరికల్
గొల్లగ రేగియుం గుసుమపుఁగూడకపోవె; మదీయపాపముల్
వెల్లువలౌచు నిద్దఱను వేఱొనరింపఁగ, దైవదూషణం
బొల్లను; బూర్వకర్మఫలితోత్థితముల్ గదమోదఖేదముల్.

బయలం బ్రాఁకనిరంపకోతలకు నాభావంబు శుష్కించి లో
నయిపన్ రానివిషాదకశ్మలమునన్ సంతోషలోకంబె యుం
ఘయుతంబై కళదప్ప, యౌవనపుటుత్సాహంబు జీర్ణింప, స్వ
ప్నయథార్థంబును లౌకికంబనెడి త్రోవం బోయి చింతించుదున్.

నిమిషమైన రహస్యంబు నిలువలేని
యుద్దవుంబెట్టిలే 'మనయాత్మలైన
బట్టబయలుగ నిరువురిభావవృత్తు
లెఱుకపడునేమొ కన్నియా యింపు గలుగ.

కామదగ్ధంబునై, శాంతి గాంచి యున్న
భావభూతిని నిర్మలప్రణయలతిక
లల్లుకొని పూలు పూచె, నాయార్ద్రగంధ
మిరువుర మనుభవింపలేమే లతాంగి!

పండిపండని కోరికపంటభూమిఁ
జొరలి ప్రవహించు విరహనిర్ఝరిణీతటులఁ
బ్రణయబంధంబు విచ్చి, పరస్పరాను
చింతలకు జలాంజలి యీయ సిద్ధపడెదొ?

అట్లుగాక, వెన్నెల గాయునట్టిరేల
వలపుమధువాని చిత్తంబు భ్రమయుచుండఁ
జుక్కపూవులపందిరి సాగయఁ, జేతఁ
బట్టెదో వట్టివేళుల వ్యజన మబల!

తలిదండ్రుల్ మనకోరికల్ సమయుయత్నంబింతగావించియుం
గలలం గల్గు మనోహరప్రణయసఖ్యంబుం దొలంగించిరే
చెలియా, యిద్దరిప్రేమబంధనము విచ్ఛిన్నంబుగాకున్నఁగాం
తులు దుస్సాధ్యము లయ్యెఁ గొంతదనుకన్ సంతోషమే
గూర్చెడిన్.

ఇంక నీలోకమున మన కిద్దఱకును
హృదయరక్తికి నాలంబ మొదవకున్నఁ
బ్రణయ మెల్ల ఫలించు స్వర్గమ్మునందు
ననుభవింత మానందరసామృతంబు.

కనులంగాటుకచీఁకటుల్ నెఱయఁ గ్రీగంట న్వీలోకించి నా మనమ్ముఁ మానఁగరానిగాయములనొంపఁ స్వప్నమట్లెల్ల చక్కనిదానా! పొడకట్టి దీవు; నను నింకం జిమ్మచీఁకట్ల వీణను వాయించి వియోగగీతి లయ మొందం బాడని మ్మొంటిగఁ.

సంధ్య.

అరుణుఁడు పశ్చిమాద్రిశిఖరాంగణముం డిగబాఱె. వారిదో
త్కరశకలంబులన్ రుధిరకాంతులు పెల్లలరెన్ దిశాంతముల్
పరగెఁ బరస్పరంబు నిరువాగుల వారలు పోర, రక్తని
ర్ఝరముల, నంగఖండములఁ గ్రాలురణస్థలి యట్లు దోఁచెడిన్.

భారతవీరపుంగవులు భాస్కరతేజు లపూర్వశౌర్యదు
ర్వారులుధార్తరాష్ట్రులును బాండునృపాలతనూజు లుర్వికై
ఘోరరణంబు సల్ప నటఁ గూలిన సైనికభగ్నకాయముల్
పేరిన యుద్ధరంగములలీలఁ జెలంగును బశ్చిమాశయున్.

క్షాత్రయుగంబునన్ భరతశౌర్యరమామణివారికేళికిన్
శత్రుల శీర్షముల్ జలజషండముగాఁగ విభిన్నబాహువుల్
చిత్రమృణాలవల్లులుగఁ జెల్వగు శోణితపూర్ణసంగర
క్షేత్రసరోవరంబు విలసిల్లెనొ నా నపరాశ శోభిలున్.

కాంచగనే జపారుచిరకాంతులు మెల్లన నెల్ల లీనమై
కాంచనదీధితుల్ దిశలఁ గ్రమ్మెఁ బురాతనభారతోర్వియా
నంచున జాళువా గనిగ సంపదలం దులతూఁగుచుండెఁ బో
యంచుదలంపహేమమయమయ్యెనజాండముచూడనందమై

ఎఱలకు నేఁగు పక్షికులమెల్లఁ గులాయములంటి యాతురం
బఱచుచు వచ్చుటం గనగ భారతదేశసువర్ణసంపదం
బరధరణీజనుల్ గని యపారముదంబున దానిఁ దోఁచుకోఁ
బరుగిడి వచ్చిరో యనఁగ భావమునం బొడకట్టు వింతగన్.

అంతఁ గ్రమముగ సౌవర్ణకాంతి దిశల
మఱగ, నిబిడాంధకారంబు మల్లడించె
నతులభాగ్యంబు శౌర్యంబు నంతరింప
సొంపు దఱిగిన యార్యవసుంధర వటు.

ఎప్పుడు గాఢసంతమస మీవసుధ న్విడుఁ, బ్రాచ్యదేశ మిం
కెప్పుడు శోణితార్ద్రరుచి నింపులుచిల్కను, బాలభాస్కరుం
డెప్పుడు పూర్వమట్టుల రహించుఁ బ్రతాపసముజ్జ్వలంబుగా
నెప్పుడు మాను నో జలజశృంఖలరాయిడి బంధ రాళికిన్.

క వి.

వేగుజామున వికసించు విరులయందు
ఱేకులెడలించుసంజపూరెమ్మలందుఁ
గావ్యమునఁ బోలెఁ బఠియింతుఁ గౌతుకమునఁ
బ్రకృతిసామ్రాజ్యపాలనాపద్ధతులను.

చటులకల్లోలరసనల సాగరంబు
పవలు రేయు నాలాపించు పాటలందు
ననితరగ్రాహ్యధర్మంబులై చెలంగు
విశ్వసృష్టిప్రకారముల్ వినుచు నుందు.

శ్యామలాకాశఫలకమునందుఁ దరళ
కాంతి వెదచల్లు తారకాక్షరము లొనరఁ
విశ్వవైశాల్యబోధకవిద్యనేర్తు
శర్వరీగర్భశాంతి యొజ్జగ విధింప.

కవి.

గజురుతుంపరముత్యాలు కాన్క లిడుచుఁ
దరలు సెలయేఁటిపాటలో దాఁగియున్న
రాగతత్వంబు నామనిరాత్రులందుఁ
గూయుకోయిలకడ నేర్చికొందు వనుల.

స్వీయచరితారహస్యంబు వ్రాయఁబడిన
హృదయపుస్తకపుటముల ముదముతోడఁ
బ్రకృతి నా మ్రోల విప్పఁ బ్రభాతరాగ
రంజితం బైన తూర్పుతీరంబునందు.

కుసుమాశ్రువులు.

కమలా! లెమ్ము కుటీరకుడ్యముల బంగారంపు లేఁ బూతలం
గొమరారన్ రచియించె సూర్యకిరణాంకూరంబు లిప్పట్టునన్;
సుమముల్ గోయఁగఁ బొమ్ము, నాన్నజలముల్ జొబ్బిల్లు నీర్కావివ
స్త్రముతో స్నానముచేసి వచ్చెడిని పూజాసక్తచిత్తమ్మునన్.

అని జనయిత్రి వల్కు విని యంతఁ గుమారిక లేచి దంతధా
వన మొనరించి బృందకును భక్తిఁ బ్రదక్షిణ మాచరించి చ
ల్లని మలగాలిసోఁకి యొడలం బులకల్ మొలకెత్తఁ బైటకొం
గును బిగియించి తోఁటకడ కుంజను దెంచె ననంటిదొప్పతోన్.

> శీఁత పచ్చికతలలఁ జలించుచున్న
> మంచు తుంపరముత్యాలు మగువనడచు
> నపుడు నటునిటు జిందుచు నంఘ్రితలము
> చలికి మొద్దువాఱెనోయనఁ జలపరించు.

అరుణమయూఖరంజితములైన హిమాంబుకణాళిముత్యపున్
సరములు ద్రెవ్విపో వరుసజాఱెడి పోలికఁ బూవురేకులం
దొరఁగుటఁ గాంచి యేమియనుదోఁపక యాకమనీయదృశ్య
బంధురత మనంబు మగ్నమయి తొయ్యలి యాయనుభూతి
నుండఁగన్.

అమ్మ కమలా! బిరాన రావమ్మ యనుచుఁ
దల్లి పిలిచెనుగాని నితాంత పార
వశ్యముననున్న కమల యాపలుకులయిన
వినక తలపోయుచుండె నా విధములెల్ల.

ఎట్టులఁ జేతులాడునొకో యీ కుసుమంబులఁ గోయఁ గాల్వలం
గట్టెడు నశ్రుబిందులటు గాఁ దెలుఁబువ్వులనుండి మంచు బొ,
ట్లట్టిటు గాలికిం గదలినప్పుడు పువ్వుల మధ్యనుండి సొం
పుట్టుగనవ్వునాఁ బ్రకృతి, యుల్లము తాండవమాడు వేడుకన్.

కన్నుల విందు సేయు సుమకాండముఁ ద్రుంచి విచిత్రశోభలన్
జెన్నొలికించు నీ ప్రకృతి చిత్తము నెత్తురు లొల్కఁ జేయ నే
నెన్నఁడుఁ బూన; లేఁ బొడువు లెండలు సోఁకినఁ బుల్కరించు పూఁ
బిన్నల హత్యచేయఁ దలపెట్టుట క్రూరము నన్నుఁ బోఁటికిన్.

ప్రకృతి రామణీయకమును పాడుపెట్టి
దైవపూజకుఁ దొడగెను దండ్రియేమొ!
ఆత్మకుసుమసమర్పణం బాచరించి
వేదవేద్యునిఁ బూజింప వేడికొందు.

రెడ్డికుల ప్రబోధము.

రెడ్లుగాఁబుట్టిన ఋణముఁదీర్చుకొనంగ
వీక్షించితిరె కొండవీఁటికోటఁ !
దలఁచిన యంతఁ జిత్తమున రోషము రేఁపు
కత్తుల రూపంబుఁ గాంచినారె !
రెడ్డివీరకుమార హృదయరక్తంబులఁ
దోఁగిన రణభూమిఁ ద్రొక్కినారె !
యాంధ్రశౌర్యేందిర కకలంక భూషణం
బౌ రెడ్ల చరిత విన్నారె ? యన్న
లార! యూరక రెడ్డికులాన జన్మ
మెత్తితిమఁటన్న యాదాయ మేమిగలదు ?
తల్లిమొగము నెఱుంగని తనయు లవత
రించియును లేనివారలే మెంచిచూడ !

సచ్చిదానంద దర్శనుఁడు వేమనయోగి
మనకులంబునఁ బుట్టెననిన జాలు ;
షట్చక్రవర్తి సచ్చారిత్ర నిర్మాత
మనవాఁడె యన్న యాఘనతచాలు ;

ఆంధ్రవీరాంగనయైన నాయకురాలు
మనకులస్త్రీ యన్నమాటచాలు;
ఔదార్య ధుర్యాత్ముఁ డన వేమభూపుఁడు
మావాఁడె యన్నసంబరముచాలు;
నింక నెందఱెంచఁజని యహీనయశులఁ
గాంచి లోకైక విఖ్యాతి గన్నయట్టి
రెడ్డికులపుఁ జారిత్రంబు శ్రేష్ఠమనుట
కేమిలోపంబుగలదు, మీరెఱుఁగరయ్య.

ఘనసైన్యంబులఁగూర్చి బాహుబలవిక్రాంతి న్విశేషించి, వ
ద్మనృపాలాళికి గుండెగాలముగ, విద్యానాథులై కొండవీ
టను నద్దంకిని రాజమహేంద్రపురిఁ గోటల్గట్టి శౌర్యంబునన్
మును బాలించిన రెడ్డిరాజుల యశంబుల్ నేఁటికిం గ్రాలవే!

మాతృరాజ్యరమామణుల్ చెఱఁబడి
గోడుగుడిచినచోటు కొండవీడు;
ఆంధ్రదేశమతల్లి యలికంబునందాల్చు
మండనతిలకంబుకొండవీఁడు;
కవితారసాలోల కల్లోలినిందోఁగు
పండితాఢ్యుల నాడు కొండవీడు;
ఖండితారాతిరాణ్మండన మండితా
ఖండలచాపంబు కొండవీడు;

అట్టివీటను బెన్గోట గట్టినట్టి
మేటిదిట్టలు మనతోంటి పోటరులేక !
నేఁటికిని రెడ్డి వీరుల నెత్తురచట
శౌర్యసౌరభ్యములు వెదజల్లుచుండు.

అరివీరకంఠనాళాస్త్రప్రవాహంబు
గవిసి త్రుప్పెత్తిన ఖడ్గధార;
భూగర్భమున రక్తపూరవిలీనమై
విశ్రమించిన బాహువీర్యమహిమ;
కావ్యసంపుటబద్ధ గాథాశ్రయంబున
గ్రుక్కిళ్లుపోవు నకుంఠకీర్తి;
బహుకాలవిశ్లేషభరమున శోషిల్లి
రమణవాసినయట్టి రాజ్యలక్ష్మి;
యింకనెప్పుడు పూర్వశౌర్యాంక సరణి
రెడ్డికులవీర దోర్బల శ్రీసమాశ్ర
యంబుగాంచి వర్ధిల్లునో ? యట్టియదను
గల్గునో ! మన కంత భాగ్యంబు గలదో ?

పోయిరివీరభద్రుఁడనపోతమహీపతి వేమయోగియుం
బోయెను మల్ల రెడ్డికవి, పోయెను గాటయవేముఁడుర్వరణా
జేయకుమారవీరులును జెల్లిరి; రెడ్డికులంబు డొల్లయై
పోయెనటన్న లాఘవము పొందనిరీతి యశంబునిల్పుఁడీ;

పోయి రేగాని వారల భూతినుండి
రేఁగుచున్నది వెండియు రెడ్డిశక్తి;
యింకనొకమాఱులోకంబు నెల్ల నాత్మ
దివ్య తేజంబున న్ముంచి తేల్పఁగలదు;

పచ్చి నెత్తురుటలల్ పై రేఁగు రణభూమి
జయనావ నడిపించు శౌర్యలక్ష్మి,
మోహనసౌరభ్యము ల్విసాళింపంగఁ
గవితాలతాంగి తోఁగలయునేర్పు,
కీర్తివల్లికలు క్రిక్కిఱిసి దిక్కులకెల్లఁ
గృతులందుకొన్న సాహిత్యరక్తి,
చేయొగ్గి యర్థులు జేపెట్ట సర్వస్వ
మైననిచ్చెడు నుదారాశయంబు,
హోమధూమావృతం బగ్నిహోత్రమటుల
సన్నగిల్లియుఁ, జావదు చావలేదు
ఇప్పటికిరెడ్డి కులమందు; నింకఁ జావఁ
బోదు మననెత్రుకడపటి బొట్టువఱకు;

ఐరోపు విశ్వవిద్యాలయంబులయందు
హెచ్చుపరీక్షల నిచ్చివచ్చి,
యున్నతోద్యోగంబు లొంది కీర్తినిగాంచు
రామలింగారెడ్డి ప్రభృతులుండ,

పూర్వగంధము నంత పోలిపోక యిలనేలు
గద్వాల మునగాలత్క్ష్మాపులుండ,
ఆత్మకులోత్సాహ మతివేలముగ రేఁపు
కవుల కిన్నెరగీతి గడలుకొనఁగ,
ఈవియున్నతిచాటు నీటొను పోలు న
ర్పణ మిడ్డ రేబాల వంశమలర
కులము బుణమెల్లఁ దీర్చితోఁ గోర్కెతోడ
బద్ధకంకణులై నిల్చి ప్రముఖులుండ,
మాతృ రథమేల వంకనిమగ్నమగును?
కొడుకులము లేమొ మోకులుదొడరిపట్ట.

కొండవీఁటి దుర్గంబునఁ గ్రుంకినట్టి
రెడ్డిసూర్యుండు కాళరాత్రిని దరించి
యభినవాంశు ప్రసారంబు లలరుచుండఁ
దూర్పుదిక్కున నల్ల దే తోఁచువాఁడు.

అనుమానంబొకయింత లేక గనుఁడీ యావచ్చు బాలార్కబిం
బ నవాంశుల్ ఘనమాలఁ జీల్చికొని సైపన్రానికాంతిచ్ఛటం
గనులంగట్టుఁ; బ్రబోధగీతము లుషఃకళ్యాణి తారస్వరం
బున నాలాపము సేయుచున్న యది పెంపుంబొంద నుత్సా
హముల్.

పీడిపోయిన తంత్రులు బిగియఁగట్టి
హృదయమందుఁ బ్రతిధ్వను లెసఁగునటుల
వీణసారించుచున్నాఁడు ప్రియసుతుండు
లెమ్ము నిద్దుర, రెడ్డికులమ్మ ! యింక.

అరుగో!యూర్ధ్వపథంబునంగనుడు,దివ్యాకారముల్ దాల్చికీ
ర్తి రమాకాంతులు, రెడ్డివీరులు రణోర్విన్ దేహముల్వీడిని
ర్జరలోకంబునసౌఖ్యముల్ వారయుస్వార్థత్యాగు,లానందని
ర్భరచిత్రంబులఁ బుత్రులంగనఁగఁ జేరన్వచ్చి, మందారపు
ష్ప రసౌఘాకుల బంభరారవ మిళద్భవ్యామలాశీరవం
బు రహింపన్ వెదజల్లువారలు సుమంబుల్ మోదబాష్ప
ర్ద్రిముల్.

నేఁడుపవిత్రవాసరము నిర్మల చిత్తముతోడ నందఱుం
గూడి కులాభివృద్ధికొఱకుం బనిసేయగదీక్షఁబూని మీ
వాడలఁ బల్లెలన్ నగరవాటికలందుఁ బ్రబోధగీతముల్
పాడుడు, కంకణాలు మణిబంధములన్ ధరియింపుఁడర్థిమై.

ధనధాన్యంబులుప్రాజ్యభోగములువిద్యాబుద్ధులుంగీర్తియు
న్ఘనశౌర్యంబు నుదారతాగరిమ చక్కంగల్గి తంగేడుపూ
చిన చందాన సతంబు నూత్నరుచులంజెన్నారుతన్ విశ్వమో
హానమై రెడ్డికులంబు సర్వజన నిత్యానందసంధాయిగన్.

సోదరీస్మృతి.

చెల్లెలా! నీవు స్వర్గమ్ముఁ జేరికొన్ని
వత్సరంబులుగడచియుఁ బ్రకృతియందు
నీదుచిహ్నంబు లెల్లెడ నింపినావె
యనుదినంబును నాకు దర్శన మొసంగ.

శారదాంబుదమాలిక సడలిపోవఁ
గళలు దేఱిన శశిరేఖఁ గాంచినంతఁ
బొత్తిగుడ్డలు దొలగింపఁ బొనరునీదు
నాస్యబింబము తలఁపున నవతరించు.

ప్రత్యూషంబున మంచుతుంపరలతోడ
విచ్చు పన్నీటిపువ్వు సేవించినంతఁ
దల్లికౌఁగిట మురిపెంబు వెల్లిగొలుపు
నీదుముద్దు మొగంబు వర్ణింపఁ జేయు.

సందెవేళలఁ బలుచని జలదములను
బూతపూచెడి చెంగావి పూలసౌరు
నవ్వునెడ నీదు చెక్కుల నాట్యమాడు
కాంతిమంజిమ మటునాకుఁ గానిపించు.

భౌతికంపు సంబంధము వాసియును ని
రంతరాధ్యాత్మిక ప్రణయంబు మనల
గడువరాని బంధంబులఁ గట్టివైచె,
స్వప్నవీథికి వచ్చెదే ప్రతిదినంబు.

కోయిల

పైరుకోఁతలఁ గష్టించి పల్లెచెలులు
కొంత విశ్రాంతిఁ గొన్నారు కోయిలా, ర
సార్ద్రకంఠంబు నెత్తి గానామృతంబుఁ
జల్లుమా వారిమనములు చల్లవడగ.

చిత్తరంజకరాగనిశ్రేణి వైచి
దివ్యగానంబు భూమికి దింపరావె !
తంత్రు లెడలిన వల్లకీదండ మటులఁ
గూజితవిహీనమై తోఁచు గున్నమావి.

నీవు లేకున్న గగనవనీనికుంజ
తలములును బాడుపడినవిధానఁ దోఁచు !
నేడ కేఁగితో కోయిల యెమ్మెలాడి !
పాడరావమ్మ యొకమాఱు ప్రణయగీతి.

తేనెలూరెడి నీపల్కు తీయ్యఁదనముఁ
గోరి విరహులపోలికఁ గుందువారు
కవివతంసులు; వానంతకాలలాంఛ
నంబవయి రావె కోయిలా సంబరముగ.

స్వాతంత్ర్యరథము.

అంబుదంబుల నమృతపూరంబు లొలుక
నింద్రచాపంపుఁదోరణ మింపుఁ గులుకఁ
గాఱుమెఱుఁగులు నెల్లెడఁ గడలుకొనగ
వెడలె స్వాతంత్ర్యరథము విన్వీథియందు.

జలధరమాలఁ జీల్చికొని స్యందనకాంతి నభోంతరాళ ము
జ్జ్వలితముచేసి యంధతమసంబులు వాఱిన మూలలైన శో
భల ననలెత్తఁజేయుచుఁ బ్రభాతవిభాకరబింబమట్లు సొం
పిలుచు నవీనజీవనము వింతగనింపె సమస్తసృష్టిలోఁ.

ఆరథమందు దీప్తిమయుఁడై కనుపట్టె నిజప్రభావదు
ర్వారపవిత్రమూర్తి కనుపండువుసేయుచు, ధర్మజీవనా
కారమొ! శాంతిబింబమొ! యకల్మషసత్యనికేతనంబో! సం
సారఫలస్వరూపమొ! ప్రజాహృదయంబో! యనన్ వెలుం
గుచున్.

ఒకచేతన్ రుధిరంపుఁబాత్రమును వేఱొక్కంటఁబీయూషపా
త్రికయుం గైకొని సభ్యతామిషమునన్ దేశంబులందెల్ల నిం
తకు ధర్మంబులు గాఁగ నెన్నఁబడు నన్యాయంబు లీనాఁటితో
వికలంబై చనుగాక యంచుఁ గరుణావేశమ్ము దీపింపగన్.

వచ్చినెత్తుఱు నమృతంపుఁ బాత్రఁబోసి
దివ్యదుగ్ధంబుగా మార్చె దేవిమహిమ,
హాలహాలగర్భమందైన నమృతరసముఁ
సంభవించు నటం చిలఁ జాటనేమొ!

నిలువదు స్యందనంబు ధరణీపతిపాలన దండభీతిచే
నిలువ దనాథబాష్పములు నిల్చిన పల్లవునేల, మోసగిం
పుల మఱపించు క్రించుఁదనపుంజతురాత్ముల కాఁగఁబో దన
ర్గళజవమొప్ప నేఁగెడిని గన్నులకుం గనరానిచోటికిన్.

పూర్వసింహాసనంబులు, ప్రోజ్జ్వలంపు
మణిమయకిరీటములు భోగమందిరములు
చక్రసంఘర్షణంబునఁ జదిసిపోయి
యవి యివి యనంగరాక రూపఱెడు నేఁడు.

లేవు దివ్యతురంగముల్ లేవు కరులు
ప్రజలె యా తేరుమోకులఁ బట్టువారు
వాయుజవమునఁ దారకాధ్వమున నేఁగు
నంతరాయశతంబులనైన దాఁటి.

తేరుజాడల నెత్తురు పాఱిపాఱి
బంగరుంబంటఁబండించె బక్కనేలఁ
జక్రనేములు దాఁకిన స్థలములెల్ల
సస్యలక్ష్మికిఁ గళ్యాణశాల లయ్యె.

స్యందనాసీన యగుదేవి "శాంతి శాంతి"
యనుచు మంజులగానమ్ము నలరఁజేసి
నవ్యనక్షత్రవీణాస్వనమ్ములందు
మేళవించెను జనులు విస్మితులు గాఁగ.

ప్రణయాహ్వానము

చెలియా! వెన్నెలబైల మంచుతడిఁ బూచీవూవకున్నట్టి పువ్వుల నెత్తావులు మోచిమోచి నిడియూర్పులోవ్వునుద్యానకోమల మందానిలపోతముల్ మనల సన్మానింప వాతాయనంబులడాయంజని ముద్దుఁగౌఁగిలి సుఖంబుంగూర్చి సేవించెడిన్.

చదలుపందిట వెన్నెలజాజితీవఁ
జుక్కలను పూలుపూచి యో సుందరాంగి
ప్రణయమోహానమైన యీ ప్రకృతినెల్ల
సురభిళోచ్ఛ్వాస వీచుల సొగయనూఁచు.

పరిసరోద్యానమునఁ జూతవాటియందుఁ
గలరవంబులు సల్పి పికద్వయంబు
నిస్తరంగ సరంబటు నెగడు రాత్రి
గర్భనిశ్శబ్దతకును భంగంబుఁగొల్పు.

చంద్రికాముగ్ధ శర్వరీఛాయలందు
జీవలోకంబు సుఖసుప్తిఁ జెందుచుండఁ,
గవిమనంబును బ్రకృతియుఁ గలయుచుండఁ,
బోదమా కాంత! సెలయేటి పొదలదరికి.

పులుగులు గూళులం జెదరిపోయినచెక్కలనొ త్తికొంచుగొం
తులను బరస్పరంబు బిగితోఁ బెనవైచెడివేళ, నెప్పుడుం
దెలుపని హృద్రహస్యములఁ దిన్నగ వీనుల విందు సేయనోఁ
జెలి, సెలయేటి సైకతముఁ జేరుదమా మనకేలియాత్రలన్.

జిలిబిలికమ్మగానములు చేసెడి యాసెలయేటి యొడ్డునన్
బులకల విస్తరిల్లి నునుఁబోడిమిఁ జూపెడు నీదు బుగ్గలన్
దొలఁకెడి సిగ్గుడాలుఁ గడదోఁపని ముద్దులఁ గ్రుమ్మరించి య
వ్వేల మధురోక్తులం గడిగివైచెదఁ గోమలి! రమ్ము మెల్లగన్.

కొండవీడు.

సాంధ్యరాగాంకితాంభోదశకలచయము
లనెడి కీలల నిర్మగ్నుఁ డయ్యె నినుఁడు ;
శర్వరీకాంతకుంతలచ్ఛాయలందు
నెలవుకొనె విషాదపురామణీయకంబు.

కొండవీటిదుర్గంబునకు న్సమీప
మున నొకానొక కేదారమునఁ గృషీవ
లార్భకుఁడు దున్నుచుండి సూర్యాస్తమయము
గాఁగఁ దలపోయుచుండె నాగలిని విప్ప.

ఇటు దలపోసి పూనుకొను నెద్దుల నిల్పఁగ మేడినూనినం
తట మొనకఱ్ఱు లోఁదవిలి ధారుణిఁ జీల్పఁగ నందు వెండినం
పుట మటు పుక్క పై కుబుక భూతమటంచును గేకవైచి య
చ్చటఁ బనిసేయుతండ్రిఁ దనచక్కికి రాఁబిలిచెన్ భయంబునన్.

తనయుని వెత్తికేకలకుఁ దందరలాడుచు వృద్ధుఁడేమిరా
యని పరుగెత్త సీరపథమందునఁ బున్కనుజూపి బాలకుం
డను నిదియేమితండ్రి తలయాకృతిగల్గిన రాయి దున్నుచుం
డిన వసుధార్ద్రగర్భము వడి న్వెడలెం గనుఁగొమ్ము నావుడున్.

కృషికుఁ డంతటఁ బున్కను గేలనెత్తి
యశ్రుధారాభిషేకంబు నలవరించి
భయమునను సంభ్రమంబునఁ బలుకకున్న
తనయునిం గాంచి గద్గదధ్వని వచించె.

మాతృదేశపరాయణమానసులయి
సలిపి రిచ్చోట రెడ్డివీరులు రణంబు
కత్తిగంట్ల నమూల్యరక్తంబు దొరఁగి
కీర్తివల్లిక పాదుక్రిక్కిఱిసి నిండ.

శ్యామలాకాశవీథి నక్షత్రము లటు
కాలవాహినీతటములఁ గానిపించు
రెడ్డివీరకుమార చరిత్రపాద
చిహ్నములు, మృతశౌర్యంబు చివురువెట్టు.

అరివీరుల్, పులిగర్జలన్ విని కురంగానీకముల్ కాననాం
తరముం జొచ్చెడుపోలికన్ రణమునన్ ధైర్యంబువోనాడి యే
త్తెఱఁ బర్వన్, భుజవిక్రమంబు బలమున్ దీపింపఁ బోరాడి కీ
ర్తిరమంగాంచిధరిత్రిగర్భమునశాంతింబొందువారల్ నృపుల్

అట్టిశూరాగ్రగణ్యులయందు నొక్క
పురుషుశిరముగఁ దోఁచు నీపున్క తనయ;
దీని వీక్షించినంతనే స్తిమితమైన
నాదురక్తంబు నైత ముష్ణముగఁ బాఱు.

ఆనవిని బాలకుండు, జనకా మనవారలెవారు వారికిన్
మనకును బూర్వ మెన్నఁడయినంగలచుట్టఱికంబుఁదెల్పుమా
యనఁ,దలయూచివృద్ధుఁడు,దిగన్తములన్బలమయ్యెజీఁకటుల్
మనముగృహంబు నేరునెడమార్గమునన్ వచియింతునంతయున్

అని మొద్దులఁ బోఁదోలుచుఁ
దనయుండును దాను నింటిదారి నడచుచున్
మునుగొండవీటి నేలిన
జనవంద్యుల రెడ్ల పూర్వచరితలు వినిచెన్.

పూర్వవీరుల ధమనులఁ బొంగినట్టి
రక్తపూరంబె మనలోనఁ బ్రజ్వరిల్లుఁ
గాని, కాలభరంబునఁ గండలెల్ల
శాంతకర్షకవృత్తి దాస్యమునఁ దవిలె.

కత్తికి నడ్డులేక రిపు ఖండనలీలల నారితేరి భూ
పోత్తములన్ యశంబు గని యుర్విని బాలనచేసినట్టిరె
డ్డి త్రతతి సీరచోదకవృత్తి గ్రహించిరి; పోటుకత్తులన్
నెత్తుటఁ ద్రుప్పుపట్టి చెడనేచెడె శూరత యంతరించుటన్.

పరవీరావళిహృత్స్ఫుటంబులను జీల్చన్ శక్తిమంతంబులై
దురమందున్ మెఱుపట్లు శోభిలినకత్తుల్ నేఁడు రూపాంతర
స్ఫురణన్ సీరములందుఁ గఱ్ఱులుగ నేపున్ సొంపువోనాడియా
ధరణీగర్భముఁజీల్చుచున్న యవి శాంతప్రక్రియంగోరుచున్.

ఒక్కక్షణంబునన్ గగన ముల్లసితంబుగఁ జేసి యుల్క వే
ఱొక్కక్షణంబులో మఱుగునోజగ రెడ్డప్రతాపవహ్ని న
ల్దిక్కుల నిండి యాంధ్రమహీతేజము నిమ్మడిచేసి మోసవుం
డక్కు లెఱుంగకుంట నకటా! యలకత్తులబావిఁ జెన్నఱెన్.

ఇటులఁ జెప్పెడినంతలో నిల్లుసేరి
యెద్దులను దొడ్డిదోలిరి యిరువురవుడు ;
కొడుకుమనమున నిసియెల్లఁ గొండవీటి
స్వప్నమేదప్ప మఱియొండు స్మరణలేదు.

కవితాప్రణయిని

సరసకవిత్వశారద ! నిశాముఖచుంబిసుధాంశుమండలీ
కిరణతతుల్ శరజ్జలదకీర్ణములై మెలమెల్ల దిక్కులన్
నెఱసెడి రాత్రివేళ రమణీయసముజ్జ్వలతారకావళీ
భరితనభంపుఛాయలఁ గృపామతిఁ జేరదె నన్నుఁ గూడఁగన్.

కలయన్ స్వర్గమునందు నీదు రుచిరాకారంబు వీక్షించి చం
చలమై ద్రిమ్మరునామనంబు నిను గాంచం గ్రమ్మరం గోమలీ,
కలకంఠంబులు గూసినం గిసలయాగ్రంబుల్ పిసాళించినన్
వలపుంజిల్కెడిపూవు పూచినను నీనామంబె చింతించుదున్.

పల్లవకోమలంబులగు పాదము లీవిల మెట్టుచుండు నా
చల్లనిచప్పుడుల్ హృదయసంచలనంబుల శబ్దమట్లు రం
జిల్లగఁ జేయునుల్లమును; సిగ్గగునా ప్రణయంబుఁ దెల్పికోఁ
బల్లవపాణి, నీకృపకుఁ బాత్రుఁడనంచుఁ దలంచి వేడెదన్.

తళుకుఁబంగరుఁ జేఁటిసైకతములందావుల్ గుబాళించు పూవులగుత్తుల్ వెదచల్లుపుష్పాకులసొంపుంజిల్కుఁ నీపాదచిహ్నలవీక్షించి ప్రమోదబాష్పసలిలస్నాతంబులం జేసి ముద్దులువర్షించితిఁ జంచలాక్షిమదియందుం బ్రేమ చిప్పిల్లఁగన్.

నీవు వసియించుసీమకు నేనుఁగూడ
వచ్చెదను వేగఁ గొనిపొమ్ము వలపులాడి!
శీతలామృతవర్షంబుఁ జిందునీదు
సరసవీక్షా ప్రసాదభిక్షంబు వెటి.

అని యువకుండువల్కఁ విని యాకవితాలలితాంగిముద్దమోమునఁ జిఱునవ్వుదొంతరలు పొంపిరిపోవఁగఁ బాణిపల్లవంబున వలిపంపుఁబయ్యెదను బొల్పుగనొత్తుచుఁగాలియందెఘల్లని రవళింప నేలపయి నల్లనఁ దా బొటవ్రేలు రాచుచున్.

వలపుల తేనెతుంపరలఁ బచ్చనిమోసులనెత్తు చిత్తముం గలతనుదోఁపనీక కలకంఠమునా వచియించె మోహనా, వలికెదనోయి నీప్రణయబంధము; నెవ్వఁడవీవు? స్వర్గముం బొలముల సంచరించు మముబోఁటుల సంగతిఁ గోరివచ్చితే?

నాదుబహిరాకృతిఁ గని యానందవార్ధి
నోలలాడిన వారెందఱో గలారు,
గాని, యెడలేనిప్రేమశృంఖలలఁ జిక్కి
నామనముఁ గొన్న ప్రియులు గానంగ నరుదు.

అవనిపై సంచరించు నీవంటివారు
దివ్య నక్షత్రమండలిఁ దిరుగఁగలరె?
అందరానిఫలంబుల కాసయేల
పొమ్ము, నన్నుఁ బోలువారు మాభూమిఁ గలరు.

అనవిని యాయువకుఁడు కా
మిని! యిట్టులఁ ద్రోసివుచ్చ మేలే, నీకై
యనురాగవశత నెట్టుల
దినములు గడపితినొ దానిఁ దెలిపెద వినుమా.

అప్పుడైన నీహృదయంబు నందుఁ గొంత
నెనరుగల్గి నన్నేలెదో చనవులాడి,
వినియు నీప్రేమకుం దగ ననుచు భ్రుకుటి
భంగమాత్రన నన్మృతి బయలుపఱతొ.

కవితాకోమలి, నీమనం బిడక యాకారంబుఁ గాన్పించి కై
తవలీలల్ పచరించి నా ప్రణయగంధమ్మున్ వృథా పుచ్చెదే?
యువకుండన్మధుఢార్ద్రచిత్తుఁడను స్నేహోల్లాసధుర్యుండఁ బ్రా
భవకాంక్షన్ ననుమోసగించియరుగన్ భావించితే నిర్దయన్.

ప్రత్యుషస్సులనూత్నపత్రములు విచ్చి
విమలహిమబిందువులు రాల్చు సుమవితతుల
తోడఁ బ్రమదాశ్రువులు వీడి పాడుచుండుఁ
గలికి, నీమనం బంటెడు గానములను.

పారిజాతపుష్పంబులు పవనహతిని
మృదులతృణముల రాలెడునెడల, నీదు
చరణవిన్యాసకోమల శబ్ద మనుచు
నడుగుగు ర్తులఁ బలుమారు నరయుచుందు.

సాలెగూళ్ళుల ముత్తెంపుసరములటుల
శీఁతగాలికి నల్లఁజలించు మంచు
నీటిబొట్ల మాలనుగట్టి నీదుమెడను
వైవఁదలపోసి మొగతాళిపడితిచెలియ.

గాఢనిశ్శబ్దశర్వరీ గగనమందు
నీవు పలికించు వల్లకీనినదములను
వినుచుఁ బ్రమదాశ్రుపూరంబు కనులఁదొరఁగఁ
గాంచుచుందు గభీరనక్షత్రవీథి.

వలపులు పండుపండమికి వందురుచుండెడు చిత్తమందు నె
త్తురులొలుక నడ్డుమాటలనుతూపులనొంచెదెయాత్మహత్యకుం
దలకొన దారిఁజూపెదవె, ధర్మమె నమ్మినవాని మోసగిం
పుల నలయించి చంప, నినుబోఁటికి నింతటికూరచిత్తమే.

గ్రామవాసిని, నెఱుఁగను గైతవంబు,
ప్రకృతి తల్లి స్తన్యంబునఁ బ్రబలినాఁడ,
బాలముల విహరించుచుఁ బ్రొద్దుఁ బుచ్చుచుందు,
నట్టినాముద్దువలపును నరయలేవె ?

అని యువకుండు పల్కఁగ రసార్ద్రమొనంబున రేగుభావముల్
దొనికెను బాహ్యరూపములతోనన ప్రార్థనకొప్పికోలుగాఁ
జనవుమెయిన్ మృణాళసదృశంబగు బాహువులెత్తి ప్రేయసుం
దనకవుగింటనొత్తెఁ గవితాలలితాంగి విముగ్ధచిత్తమై.

ద్రౌపదీ సందేశము.

సంజయా, యింకఁజాలు నీశాంతిమార్గ,
మడవిఁబడరాని యిడుమలఁ బడితిమయ్య;
బోధలొనరించి హక్కులఁ బులిమివుచ్చ
నిన్నుఁబంపెనె కురురాజు నేర్పుతోడ.

వగచినట్లుండవలయును, వానియాలి
త్రాడు తెగవలెనన్న విధాన నీవు
పూర్వకష్టంబులకు సానుభూతి చూపి
తేనెపూసిన కత్తిని దింపఁదలఁతె.

కపటమార్గంబులం బన్ని కనులు మూసి
రాజ్యభాగంబుగొన్న ధైర్యంబు కతన
నేఁడు సైతము మాటల నిద్రవుచ్చి
వనికి వెడలింపఁ గుట్రలు పన్నువారె?

మున్నటి దినాలుగావివి మోసములకుఁ
దవిలి తలయూచునే నేఁడు ధర్మరాజు ;
పరిభవానల కీలలు పాండుసుతుల
హృదయముల రగిలింపవే రేపుమాపు.

నను సభలోని కీడిచి, కనన్వినరాని పరాభవంబు చే
సినఁ గనులారఁ గాంచియునిసీ ! పతులేవురు ధర్మబద్ధులై
మును పగఁదీర్పకుంటఁ గురుభూపతిమమ్ములఁ జుల్కనాడెనం
ట! నిరతమొక్కరీతిఁ జనునా మనకాలము సంజయూయొటన్.

అంతంబొందెనె పాండుపుత్ర దృఢబాహాశక్తి రోషంబు;దు
ర్దాంత ప్రక్రియ వైరివీరమథన ప్రారంభ కౌతూహల
స్వాంతులన్వాంతులుగారు కాలమెపుడో వచ్చుంగదా యంత మీ
త్యంతాన క్తిఁ బ్రతీక్షచేసెదను శౌర్యాలంబులౌ మత్పతుల్.

రాయబారంబు లేల యీరచ్చలేల ?
పాలుగోనక శాంతింతురే పాండుసుతులు ?
ఊరకిమ్మన్న నిచ్చునా యుర్వి నృపుఁడు ?
పిల్లిశాపంబులకునుట్లు ద్రెదిలిపడునె ?

తెలుపుము సంజయా, విరటుధేనువులం బరిముట్టువేళ ను
జ్జ్వలభుజవిక్రముల్ కురునృపాలవరుల్ చవిగొన్న పార్థుతూఁ
పుల దొనలింక రిత్తవడిపోవవు; గాండివి చిత్తమట్ల వై
రుల రుధిరంబుఁజూఱఁగొనరోషముఁగ్రక్కుశరంబులేనియుఁ

రాజ్యమేనాటికిని వీరభోజ్యమనుచు
జనులు పల్కెడిమాట నిశ్చయము సుమ్ము,
పరమసుఖములఁ దులదూఁగు నరవరుండు
పిలిచిరాజ్యంబులిచ్చునే భిక్షుకులకు.

బొల్లిమొగాలపైఁ జెమటబొట్టులు గ్రమ్మ సురక్షతంబులన్
జెల్లుగ నెత్తురోడికలు పేర్చగ మిమ్ము పృథాసుతుండు వి
ద్యుల్లతికాభ బాణములఁ దూలనదల్చి వధించుదాక మీ
యుల్లము రాజ్యభాగమున కొప్పునొయొప్పదొ సూతనందనా?

వైరివిభీషణాకృతిని వాయుసుతుండు గదన్ ధరించి దు
ర్వారమదేభ మబవనిపైఁ బడురీతిఁ గురూర్వినాథు లం
బేరు దలంపరానియటు పీనుఁగుపెంటలు సేయునప్పుడై
నా రవయేని నెంతురె మనంబునఁ బాండుతనూజశౌర్యమున్.

కవలనఁ బిల్లవారలటుగాఁ దలపోయుదు రేమొ! మీ పయిం
గవిసిన యప్డె వారి భుజగర్వము శౌర్యముగానవచ్చు; మ
బ్బు విడిచివచ్చుసూర్యుని సముజ్జ్వలతేజమునాగఁ జూడఁగా
నెవరును జాలరయ్య రణమే త్తెఱ సల్పెడి బాలవీరులన్.

ఉత్తమాటలనేమి ప్రయోజనంబు
అవని యొసఁగుటో, లేకున్న నని సలుపుటో
చెప్పివంపుడు ; నామేన జీవమున్న
దనుక సంధియత్నంబులు దలఁగుడయ్య.

దుర్యోధనుఁడు.

రాజరాజ! దుర్యోధనా! రాజ్యలక్ష్మి
నట్టనడియేఁటియందు నీపుట్టిముంచె
నయ్యొ, విధితిరస్కారంపు టవధియౌర
నీదునంత్యపతన మింత నీచమగునె !

ఏలితివిధరావలయ మెంతటివీరులకేని గుండెలో
గాలముగాఁగ వైరిబలగంబులకున్ యమదర్శనంబుగన్;
పాలకుఁ బోరువెట్టు పసిపాపలు "వచ్చెను రాజరాజ"నన్
డోలిక నిద్రవోదురు కదు న్వెఱపెత్తఁగఁ బేరువిన్కలిన్.

ఎఱుఁగవె భీతియన్న నదియెట్టుల నుండునటంచుఁ బల్కు నీ
వెఱవమి విక్రమక్రమము వీర్యము నెక్కడపోయెనోయియా
నరసున డాగినాఁడవు, విచారములేదె? యశంబుకన్న న
శ్వరమగు ప్రాణముల్ మధురనంబులె? భారతకీర్తి నెంచవే.

హృదయముఁ గోసియిమ్మనినఁ బ్రీతిగ నిచ్చెడుప్రాణమిత్రుఁడే
యదవదలేక నీకయిరణావనిఁగూలిన కర్ణయోధ నీ
మదిఁ బొడకట్టఁడే, యిటుల మాన్యతవోవిడి తుచ్ఛజీవముం
బదిలము సేయనేల నరపాలక, వంశయశంబు నెంచుమా.

ఎంతకాలంబు బ్రతికిన నెప్పుడైన
మరణమొందక మానఁడు మానవుండు;
క్షత్రియునకు వ్యాధిబాధలఁ జచ్చుకన్నఁ
గత్తిపోటుల మడయుటే కరము ప్రియము.

సాటిలేనివిరోధులఁ జదిపినట్టి
పరభయంకరగద చేతఁ బట్టినావు;
లెమ్ము లెమ్ము, దుర్యోధనా లెమ్ము లెమ్ము
క్షత్రియత్వమురూపింప శక్తిలేదె?

ప్రవహింపదే నీదు రక్తనాళంబులఁ
బూర్వుల శోణితపూర మిపుడు,
ప్రజ్వలింపదె నీదు భావకుండంబున
నవమానరోషహోమానలంబు,

తీఱెనే నేఁటితో దిక్కులవిలసిల్లు
భారతక్షత్రియవంశకీర్తి,
గొడ్డువోయెనె నేఁడు కురురాజ్ఞి గాంధారి
కదనవీరశతంబుఁ గన్నతల్లి
లెమ్ము దుర్యోధనా యింక లెమ్ము లెమ్ము
సరసితటమున నున్నారు సమరకాంక్షు
లైన పాండవేయులును మురాంతకుండు
ప్రాణములపైన మోహంబు వదలుమయ్య.

ప్రాణమిత్రుండు కర్ణుండు స్వర్గ మేఁగె;
నంపశయ్యను గాంగేయుఁ డస్తమించెఁ;
గొడుకులును దమ్ములునుగూడఁ గూలినారు;
అంత యభిమానమే దేహమందు రాజ!

గెలిచితివా యకల్మషపుఁగీర్తియు రాజ్యమునబ్బుఁ బ్రాణముల్ దోలఁగితివా నిలింపపురితోఁటలలో విహరింతువయ్య; శూరులకు రణంబు పంపవు; విరోధుల గీటడగించి సర్వభూవలయము నైనఁ జావయిన భారతరాజ గ్రహింపు మిత్రతన్.

రాధ యుత్కంఠ.

చల్లని పన్నీట జలకంబులాడి
యగరుధూపము వెట్టి యలకంబులార్చి
నుదుటఁ గస్తూరి బొట్టు కుదుటుగాఁదీర్చి
కన్నుఁదమ్ములఁ గ్రొత్తకాటుక దిద్ది
గోరింటపూ గుత్తి కొప్పునం దురిమి
కమ్మతావులనీను కలపంబునలఁది
పొడికప్పురంబులఁ బడకింటఁ జల్లి
పాన్పుపైఁ బువ్వులు పఱపుగాఁబఱచి
యేలరాఁడో సామియింకేలరాఁడో
యనుచుఁ బొరమునానుకొని వేచియుంటి.

*　　*　　*　　*

స్వాంతమాలన్యంబు సైరింపలేక
వేదనాభరమున వ్రీలంగఁజొచ్చెఁ
గనికనిదారులు కన్నులునొచ్చె
నాసామి కృష్ణుండు ననుగాంచరాడు.
సంజకెంజాయలు శమియించిపోయెఁ

బక్షులు గూళ్లకుఁ బరుగిడసాగె
మందలకావులు మరలిపోయెడిని
వేణుగానంబులు వీనులసోఁకె
కోయిల క్రొమ్మావి గుబురులోఁ గూసె
సందెచీఁకటి పొగ చదలావరించెఁ
జుక్కల రనగుండ్ల జొంపంబులలరె
నేలరాఁడో కృష్ణుఁ డింకేల రాఁడో !

* * * *

కప్పురపుందివ్వె కడముట్టవెల్గె
పాన్పుపైఁ బువ్వులు వసివాళ్లువాడె
మంచిగంధపుఁబూఁత మైఁ జిట్లిపోయె
నిద్రమాంద్యమ్మున నేత్రముల్సాగిడెఁ
బడమటి దెసకేఁగు నుడు గణంబులను
గనుచు ద్వారముకడఁ గన్నుగూర్కితిని

* * * *

నాసిగ్గు పుచ్చంగ నలిన బాంధవుఁడు
వెయ్యి దివ్వెలతోడ వెలుగుచు వచ్చె

* * * *

కూర్కులేమిని గన్నుఁగొన వెఱ్ఱవాఱు
బారలుచిట్టిన మేనిపూఁతలురాలఁ
జెమ్మట ముత్యాలు చెక్కిళ్లజాఱ

ఘల్లుఘల్లని చేతిగాజులు మ్రోయ
మజ్జిగఁ జిల్కుచు మధురగీతములఁ
గాంతుఁడొనర్చిన కఠినంపు నేతఁ
దుమ్మెదపైఁ బెట్టిదూఱుచునుండ
నాముద్దు కృష్ణుండు నావెన్క నిలిచి
ముసిముసి నవ్వుల మురియుచునుండె

* * * *

వేచియుండిన యప్పు విభుఁడరుదేఁడు
వేసవివానల విధముగా నతఁడు
కలవలె వచ్చును గనిపించిపోవు.

ఎంత మోసము!

బాటసారి.

చీలుదారులఁ గూర్చుండి చిన్నదాన!
కన్నులను నీరు నించెదు కరుణమొలుక?
నేపథంబున నేఁగ నీ కిచ్చ గలదు?
ఇరులు గ్రమ్మకమున్నె ని న్నిల్లుసేర్తు.

చెట్లనీడలు విరివియై చేరెఁ దూర్పు;
సంజకెంజాయ పడమటఁ జిక్కనలమెఁ;
బైరుకోఁతల కేఁగిన పల్లెపడుచు
లింటికరుగుచుఁ బాడువా రేలపాట.

గాలితాఁకున వెన్నులు కదలునపుడు,
తిరుగఁబాఱిన వరిచేలు తీయురాగ
మదిగో వినఁబడుచున్నది, యలల మర్మ
రములు సంధ్యాప్రశాంతగర్భమునఁ బోలె.

యువతి.

గోపికామోహనుఁడు నందగోపసుతుఁడు
వచ్చు నీదారి నని సఖి పలుక వింటిఁ;
బ్రొద్దుపొడుపున నుండి యీపొన్న క్రింద
వేచివేచి యీదారులు చూచు చుంటి.

రత్నఖచితకిరీటంబు రాజశిరము
నందు వెలుగొందుచుండు నటంచు వింటిఁ,
బట్టుపీతాంబరము వల్లెవాటు వైచి
మత్తకరినెక్కి వచ్చు నన్మాట వింటి.

బాటసారి.

చిన్నికృష్ణుని సేవింపఁ బొన్నక్రింద
వేచియున్నావె? నీముందు వెళ్లినట్టి
వేణుధారినిఁ గాంచవే? విశ్వమోహ
నంపుగానంబు వినవె యో నళినవదన.

నెమ్మిపించెము క్రొమ్ముడిఁ జిమ్ముజిగులు;
చిన్నికూకట్లు మెడపైనఁ జిందులాడు;
బొజ్జవటుకును వ్రేలు కొంబూలమాల;
యతని పదశబ్దముల ఛంద మమరు చుండు.

అమహాత్ముఛ్ఛాయలు సోఁకినంతమాత్ర
జీర్ణతరులతావళిగూడఁ జివురు వెట్టు ;
ఆమురళి మోహనారావ మలరినంత
రెల్లుపుల్లల సైతము రేఁగుగీతి.

యు వ తి.

ఇవుడు స్మృతియందు నావ్య క్తియొసఁగుచుండు
భగ్నమైన యింద్రధనస్సుపగిది నహహా !
యెగిరిపోయెడు కలయట్లు లీక్షణముల
నంటి యింద్రజాల మదృశ్యమయ్యె నవుడె !

వేణుగానంబు దేనినో విన్నయట్లె
దోఁచుచున్నది, దూరానఁ దోయదములఁ
దారకావీణ లొనరించు ధ్వను లనంగ ;
నెంతమోహనంబు జరిగెనో యీ సఖుండ !

బా ట సా రి.

అదియె తెలియరాని విచిత్ర మతివమిన్న.

అజ్ఞాతకవి.

కిసలయగుచ్ఛమధ్యమునఁ గీల్కొనినేచినకాంతిఁగాంచ లే
సిసి! యనిమంచుబాష్పములఁగుందుసుచుంబటుసత్కవీశ,క
క్కస పడనేల? తావిఁగొనుగాష్పులరీతి విమర్శకుల్ కృతిఁ
రసముగ్రహించినీయశము రాజిలఁ జేయుదురయ్యయెల్లెడన్.

పొలుపుగ రేఁబవల్ నిలువఁబోక మనోజ్ఞనిసర్గగానముల్
సలిపెదు నిర్ఝరంబ! గిరిసానుతటంబున నిన్ను నెవ్వరుం
దఁలప రటంచు నెంచెదవొ, తాలిమినూనుము బాటసారి నీ
కలరవమాధురీమహిమఁ గాంచి సినుం బ్రకటించునిదరన్.

డాగియుండు వసంతంబు డాయుదనుక
వేఱ ప్రకటన నీకేల వినుమ పికమ,
స్వర్గగానంబు భూతలస్థంబుచేయు
నీ వికస్వరకంఠంబు నెగడుచుండ

ఓరి బాలక నీమురళీరవంబు
వ్యర్థమౌనని చిత్తతాపంబువలదు.
రాగపరిచితుఁ డెవ్వఁడో రమ్యగీతి
వినియెయుండు నానందంబు వెల్లివిరియ.

జాతీయగీతము.

జోహార్ ! జోహార్ ! భారతమాతా !
జోహార్ ! జోహార్ ! జోహార్ !

శారద శుభ్రవియత్తలపథమున
సంచరించు నీరథము.
నీమృదువీణా గానప్రబుద్ధము
నిత్యముమామనము.

జోహార్ ! జోహార్ ! భారతమాతా !
జోహార్ ! జోహార్ ! జోహార్ !

ప్రత్యూషలక్ష్మీ మకుటమణిప్రభఁ
బాసెతమోగణము.
నీపదపంకజ నూపురఝుంకృతి
నిద్రారహితము జనము.

జోహార్ ! జోహార్ ! భారతమాతా !
జోహార్ ! జోహార్ ! జోహార్ !

విప్లవఝంఝావిచలితజీవన
వీచినికాయమున
స్థిరవిజయోడుపకర్ణధారణము
నేయుమశౌర్యమున.
జొహార్ ! జొహార్ ! భారతమాతా !
జొహార్ ! జొహార్ ! జొహార్ !

ముకుళితహస్తులు నీప్రియపుత్రులు
మోదదృష్టిఁ గనుము.
నీకరుణామృత నిర్ఝరపూరము
నింపుమమ్మ సతము.
జొహార్ ! జొహార్ ! భారతమాతా !
జొహార్ ! జొహార్ ! జొహార్ !

నీపదపీఠిని ప్రాణసుమంబులు
నిల్పి భజించెదము
గర్హితదాస్యభరంబును మాన్పి
సుఖంబులు మాకిడుము.
జొహార్ ! జొహార్ ! భారతమాతా !
జొహార్ ! జొహార్ ! జొహార్ !

ఏలపాట.

వస్తావంటే చక్కనిదానా
వలపుచిందే చూపూదానా
మల్లెపువ్వులకోనకుపోయీా మల్లీవస్తాము.

గండుకోయిలా కూసేచోట
గుండుమల్లెలూ పూసేబాట
ముద్దుముచ్చటా దీర్చూకొంటా మురిపేమాడేము.

చెంపచేయీా పెట్టూకోని
చింతపాయ్యే చిన్నాదానా
కళ్లనిండా కాటుకనీళ్లూ గారూతుందు కే.

పక్కపక్కా రాసూకొంటా
పదముతెత్తీ పాడూకొంటా
అల్లోనేరేటీచెట్లానీడ ఆడూకొందామె.

పూలగుత్తులూ కోసీయిస్తా
పుట్టతేనెలూ తీసిపెడ్తా
చల్లనీటికొండా యేట జలకామాడేమె.

వస్తావంటే చక్కనిదానా
వలపుచిందే చూపూదానా
మల్లెపువ్వులకోనకుపోయీా మల్లీవస్తాము.

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1921.

ఆంధ్రసారస్వత లతానికుంజమున అభినవకుసుమగుళుచ్ఛములు.

దువ్వూరి రామరెడ్డిగారి కావ్యములు.

వనకుమారి.

ఇయ్యది శ్రీ విజయనగరసంస్థానమువారిచే నెలకొల్పఁబడిన ప్రబంధసమ్మానపరీక్షయందు 1918 వ సం॥మున బ్రథమ బహుమానమువడసిన యభినవపద్యకావ్యము. ఈకావ్యము 1923 వ సంవత్సరపు ఇంటరుమీడియేటు పరీక్షకు పఠనీయ గ్రంథముగ నియమింపఁబడినది. వెల 0 12 0

కృషీవలుఁడు.

ఇట్టిపద్యకావ్యము తెలుగున నిదివఱకులేదు. ఇందుఁ గృషీవలుని జీవితములోని మనోహరచిత్రములు భావగంభీరముగ వర్ణింపఁబడినవి. స్వభావమధురమైన గ్రామవాసి జీవనము ఈ కావ్యరూపమున మూర్తిభవించినది. సాహిత్యవినోదులగు మ-రా-రా-శ్రీ. కట్టమంచి రామలింగారెడ్డి యం. యె. గారు వ్రాసిన విపులమైన పీఠికయును గలదు. ఈకావ్యము మైసూరు విశ్వవిద్యాలయమునందు పఠనీయ గ్రంథముగ నియమింపఁబడినది. వెల 0 6 0

నలజారమ్మ అగ్నిప్రవేశము.

ఈపద్యకావ్యము, సహగమన మొనరించినయొక రెడ్డి పతివ్రత చరిత్రము. వెల 0 4 0

జలదాంగన.

వెన్నెల బయలఁ బంట పొలమున విహరించుచున్న కవికుమారునకు జలదాంగన తనజీవితచరిత్రము చెప్పికొనుట

ఈపద్యకావ్యమున మధురముగ రచియింపఁబడినది. "ప్రణయాంజలి" యను మఱియొక ఖండకావ్యముగూడ ఈగ్రంథమునఁ జేర్పఁబడి యున్నది. వెల 0 6 0

స్వప్న ప్రయాణము.

ప్రపంచమునందంతటను మానవహృదయము నాకర్షించు స్వాతంత్ర్యదృశ్యము స్వప్నరూపమున మూర్తీభవించినది. నవయుగప్రభాతమును దర్శించు ప్రతియాంధ్రుఁడును ఈకావ్యమును దప్పక చదువవలయును. వెల 0 6 0

సీతావనవాసనాటకము.

సీతాబహిష్కారము, శ్రీరాముని విప్రలంభవేదన, కుశలవుల శౌర్యసాహసములు, శాంతికిఁ దావలములైన ఋషుల యాశ్రమములు, పాఠకులయొక్కయుఁ బ్రేక్షకులయొక్కయు, హృదయములను రసార్ద్రములుగఁ జేయును.

వెల 1 2 0

ఈగ్రంథములు వలయువారు ఈక్రింది చిరునామాలకు వ్రాసినఁ బడయఁగలరు.

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ

లేక,

వీరేశలింగ పుస్తకభాండాగారము.
కాఁపువీధి, నెల్లూరు.

ఈపద్యకావ్యమున మధురముగ రచియింపఁబడినది. "ప్రణ యాంజలి" యను మఱియొక ఖండకావ్యముగూడ ఈగ్రంథ మునఁ జేర్పఁబడి యున్నది. వెల 0 6 0

స్వప్న ప్రయాణము.

ప్రపంచమునందంతటను మానవహృదయము నాకర్షించు స్వాతంత్ర్యదృశ్యము స్వప్నరూపమున మూర్తీభవించినది. నవయుగప్రభాతమును దర్శించు ప్రతియాంధ్రుడును ఈకావ్యమును దప్పక చదువవలయును. వెల 0 6 0

సీతావనవాసనాటకము.

సీతాబహిష్కారము, శ్రీరాముని విప్రలంభవేదన, కుశ లవుల శౌర్యసాహసములు, శాంతికిఁ దావలములైన ఋషుల యాశ్రమములు, పాఠకులయొక్కయుఁ బ్రేక్షకులయొక్క యు, హృదయములను రసార్ద్రములుగఁ జేయును.

వెల 1 2 0

ఈగ్రంథములు వలయువారు ఈక్రింది చిరునామా లకు వ్రాసినఁ బడయఁగలరు.

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.

లేక,

వీరేశలింగ పుస్తకభాండాగారము.
కాఁపువీధి, నెల్లూరు.

రెడ్డిగారి కవిత్వపు మెచ్చుకోళ్లు.

సాహిత్యవినోదులగు మ॥ రా॥ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు చతుర్థ రెడ్డిమహాసభయందు దువ్వూరి రామిరెడ్డి గారికి బంగారు పతకమును బహుమతిచేయుచు నిట్లు నుడివిరి. "కవి పిన్నవాఁడయ్యును ఆంధ్రదేశమునం గల గొప్పకవులలో నొక్కఁడని నిరాటంకముగఁ జెప్పవచ్చును. పిట్ట కొద్దిదైనను కూత పెద్దది."

"కవి మిక్కిలి ప్రతిభాశాలి. చక్కనిభావములు, శైలియు నిగ్గుదీరి యున్నది."

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు,
ఓరియంటల్ లైబ్రరీ తెలుగుపండితులు.

"వానియందు (రామిరెడ్డిగారి కావ్యములందు) కవితాబీజమైన ప్రతిభ నాకుగోచరించినది. శబ్దసౌష్ఠవప్రవణత్వముకూడ నగపడుచున్నది."

మహోపాధ్యాయ
వేదము వేంకటరాయశాస్త్రిగారు,
ఆంధ్రమల్లినాథులు.

రెడ్డిగారి కవిత్వపు మెచ్చుకోళ్లు.

సాహిత్యవినోదులగు మ॥ రా॥ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు చతుర్థ రెడ్డిమహాసభయందు దువ్వూరి రామిరెడ్డి గారికి బంగారు పతకమును బహుమతిచేయుచు నిట్లు నుడివిరి, "కవి పిన్నవాఁడయ్యును ఆంధ్రదేశమునఁగల గొప్పకవులలో నొక్కఁడని నిరాటంకముగఁ జెప్పవచ్చును. పిట్ట కొద్దిదైనను కూత పెద్దది."

"కవి మిక్కిలి ప్రతిభాశాలి. చక్కనిభావములు, శైలియు నిగ్గుదీరి యున్నది."

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు,
ఓరియంటల్ లైబ్రరీ తెలుగుపండితులు.

"వానియందు (రామిరెడ్డిగారి కావ్యములందు) కవితాబీజమైన ప్రతిభ నాకుగోచరించినది. శబ్దసౌష్ఠవప్రవణత్వముకూడ నగపడుచున్నది."

మహోపాధ్యాయ
వేదము వేంకటరాయశాస్త్రిగారు,
ఆంధ్రమల్లినాథులు.